About members of IES..

# కళలన్నీ కొలువుతీరిన వేళ....



## ఆమె... ఓ సెలయేరు !

ఆమె కంఠం - ఖంగు మంటుంది !
ఉనికి - అప్రమత్తం చేస్తుంది!!
పనిలో వేగం, చొరవ... ఆమె ప్రాణం !!!
సోమరులకి - ఆమె సింహస్వప్నం !!!!

అయినప్పటికినీ... ఆమె - తన సంస్థలో బెదిరిపోయే లేళ్ళని దువ్వి - జూలు విదిల్చే సింహాలని అదిలించి... తన దారికి తెచ్చుకుంటారు. ఈసురోమని జోగే మనుషుల భుజాలు తట్టి, తనతో పాటు వడివడిగా ముందుకు నడిపిస్తారు !

ఆమె... ఓ సెలయేరు ! అవరోధాలెన్ని ఎదురైనా- అవలీలగా దాటి - గల గలా ముందుకు సాగి - అజేయంగా నిలవడమెలాగో - విద్యార్థులకి చెప్పడం - ఆమె ప్రత్యేకత!

పరిసరాలను ప్రభావితం చేస్తూ - జెట్ వేగంతో - ఓ చైతన్యాస్త్రంలా దూసుకుపోయే ఆవిడ: విజయ్ హైస్కూల్ కరెస్పాండెంట్ **శ్రీమతి** వి. ప్రభాదేవి.



## ఆమె... మందాకిని !

ఆమె - ఎక్కువగా మాట్లాడరు!
అసందర్భంగా అరవరు !!
అనవసరంగా ఆవేశం తెచ్చుకోరు !!!
తన సహచరులమీద..ఆధిక్యత ప్రదర్శించాలనీ-అనుకోరు !!!!

అయినా ... ఆమె అడ్మినిస్ట్రేషన్‌లో - పనులన్నీ - సాఫీగా- చకచకా జరిగిపోతుంటాయి !

మాట్లాడని మల్లెమొగ్గలా - పనిచేసుకుపోయే ఆవిడ - కాకారాయుళ్ళనీ, బాకారాయుళ్ళనీ అల్లంత దూరాన ఉంచి- 'ఒక్క చూపు' తో పనిదొంగల్ని - 'అటెన్షన్' లోకి తెస్తారు !

ఆమె... నాట్యమయూరి! కుప్పి గంతులువేసే చిన్నారులని... తన రెక్కల కింద పొదివి పట్టుకుని - వాళ్ళ తప్పటడుగులు సవరించి - పాఠం చెప్పి, నాట్యం నేర్పి - వాళ్ళ ప్రతి భంగిమనీ మురిపెంగా వీక్షించి... మురిసిపోవడం ఆమె నైజం !

ఆమె.... మందాకిని ! ఎప్పుడూ ఒకేస్థాయిలో, మంద్రంగా... హుందాగా... గంభీరంగా ముందుకుసాగే ఆవిడ: విజయ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ **శ్రీమతి టి. వసంతావివేక్.**

## ఆమె... ఓ మలయ మారుతం!



ఆమెకి - భేషజాలుండవు !
అతిశయాలూ... ఆడంబరాలూ తెలీవు !!
'గుర్తింపు'కోసం తాపత్రయ పడరు !!!
పొరపాటుగానైనా - ఒకర్ని నొప్పించాలని చూడరు !!!!

ఆమె... తన సంస్థలో ఎక్కడేం జరుగుతోందీ - టక్కున పసిగట్టేస్తారు ! పరనిందలకు పాల్పడకుండా... పల్లెత్తు మాటన కుండా- పనులు చక్కబెడ్తారు !

టైంటేబుల్ తయారుచేస్తూనో - సబ్స్టిట్యూషన్ వేస్తూనో - అక్విటెన్స్‌రాస్తూనో... నిరంతరం బిజీగా ఉండే ఆమె స్పీడ్‌కి - అధునాతన కంప్యూటర్లు సైతం చేతులెత్తేస్తాయి !

ఆమె... ఓ మలయ మారుతం! విద్యార్థుల, ఉపాధ్యాయుల అవసరాలను 'అమ్మ'లా గ్రహించి- సకాలంలో స్పందించడం, ఆమెకి వెన్నతో పెట్టిన విద్య!

సదా చిరునవ్వుతో - ఎంతటి పని ఒత్తిడిలోనూ - ఎలాంటి అలసటనీ ప్రదర్శించని ఆవిడ: విజయ్ హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ **శ్రీమతి** పి. సుజాత.

## ఆమె... ప్రేమ స్వరూపిణి !



'ఒట్టిమాటలు కట్టిపెట్టి, గట్టిమేల్ తలపెట్టవోయ్!'

అని మహాకవి గురజాడ చెప్పినట్టు ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ ఆశయాల రూపకల్పనలో - స్వర్గీయ **శ్రీమతి సుశీలా రాజారెడ్డి** గారి తోడ్పాటుతో - అన్ని హంగులతో కూడిన అందమైన భవనాలు నిర్మించి, **విజయ్ విద్యాసంస్థ**లకి కొండంత చేయూతనిచ్చిన నిగర్వి ఆమె!

పేదాగొప్పా భేదం లేకుండా అందర్నీ ఆప్యాయంగా పలకరించే ఆమె - ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు, కవయిత్రి: **శ్రీమతి యన్. విజయా కిషన్‌రెడ్డి.**

ఒకానొక సందర్భంలో...

" మీ పేర నెలకొల్పిన విజయ్ విద్యాసంస్థలు ఒకవేళ ఫ్లాప్ అయ్యింటే.... మీరెలా ఫీలయ్యేవారు ?" అని ప్రశ్నిస్తే-

" నా పేరుతో ఫ్లాప్ అయ్యిందనే బాధకన్నా 'అక్క' శ్రమ వృధా అయ్యిందని బాధపడి వుండేదాన్ని !?" అని చెప్పిన ఆవిడ సమాధానం... ఆమె సింప్లిసిటీకి, ఉదాత్త వ్యక్తిత్వానికీ - ప్రతీక !

## ఆమె... ఓ తెలుగు నిఘంటువు !



శబ్దాలను పొందికగా పేర్చి, కూర్చి - తగిన అర్థాలను పలికించి... వచన రచన చేసే నేర్పు - ఆమెకి సొంతం!

తక్కువ సమయంలో - చక్కని తెలుగులో - అందంగా వ్యాఖ్యానాలు రాసి... అతిథుల్ని అలరించడంలో ఆమెకు ఆమే సాటి!

ఆమె... గొప్ప వక్త! భాషణం... ఆమె భూషణం ! పలు సాహితీ కార్యక్రమాల్ని మనోరంజకంగా నిర్వహించడంలో ఆమె సిద్ధహస్తురాలు!

ఏ అంశమిచ్చినా... అందంగా, ఆశువుగా దానికి తన కథనం జోడించి - అనర్గళంగా ఉపన్యసించి - సభికుల్ని రంజింపచేయగలిగే ఆవిడ: ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్, ఉత్తమ అధ్యాపకురాలు:

**శ్రీమతి సిహెచ్. లలితాదేవి.**

## ఆమెది.... హరిత విప్లవం !



**ఆ**మె... ఎక్కడ కాలిడినా - మొదట పలకరించేది...ఎదుటి మనుషుల్నికాదు, పూదోటల్ని ! పలవరించేది..పచ్చనోటుని కాదు, పచ్చటి మొక్కల్ని!

చివరకు... తను డ్రైవింగ్‌లో ఉన్నాసరే... ఎక్కడేనా ఒక కొత్త మొక్క కనిపిస్తే - అమాంతం కారాపి - అదేదో 'కల్పవృక్షం' దొరికినంత సంబరపడి పోతారు!

ఆమెది.... హరిత విప్లవం ! ఆమె ఏ సంస్థలో అడుగిడినా - ఎవరింటికి వెళ్ళినా - ఓ కొత్త మొక్క తీసుకెళ్ళడమో - తెచ్చుకోవడమో - చేస్తూ వుంటారు!

నేడు... విజయ్ విద్యార్థులు... ప్రతిరోజూ - మధ్యాహ్నం పూట - పిక్నిక్‌కి వెళ్ళినట్టు - చల్లని చెట్ల నీడన 'లంచ్' చేస్తున్నారంటే .... అది.... ఆవిడ చేతి చలవే!

విజయ్ విద్యాసంస్థలకి నారు పోసి - నీరు పోసి - అవి ఏపుగా ఎదిగేందుకు దోహదం చేసిన ఆమె - చదివింది ఎమ్మే లిటరేచర్ - చేస్తేమో హార్టికల్చర్! ఆవిడే డైట్ లెక్చరర్, ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్ శ్రీమతి ఎ. **తారాచౌదరి.**

**ఒక్కమాట !**

అనుక్షణం 'మన సంతతి' బాగోగులే పట్టించుకునే మనం... కనీసం ఓ అర క్షణమైనా... ఆమెలా.... 'వృక్ష సంతతి'ని పట్టించుకుంటే - దేశం సస్యశ్యామలమవుతుంది! కాదంటారా!?




## ఆమెది... సునిశిత దృష్టి !



**ఆ**మె ఒకర్ని చేరదీయరు !
మరొకర్ని ఛీ కొట్టరు !!
అధికార దర్పం అసలే
ప్రదర్శించరు!!!

తన సునిశిత పరిశీలనా దృష్టితో - ప్రతీది ఎప్పటికప్పుడు స్కాన్ చేస్తూ - స్కూలు పనులన్నీ సవ్యంగా - సాఫీగా - స్మూత్ గా జరిగేలా చూసే ఆవిడ.... ఎవరు పనిమంతులో, ఎవరు పనిదొంగలో - ఇట్టే పసిగట్టే 'ఎక్స్‌రే' యంత్రం!

ఆమె గానకోకిల ! ఆమె గొంతులో పలికే యాస - అచ్చం - ఓ పల్లెపడతి 'ఎంకి' పాడుతున్నట్టుగా - అతి సహజంగా - వీనులవిందుగా - మహా పసందుగా ఉంటుంది!

తను పాడే దేశభక్తి గీతాలకి అనుగుణంగా పిల్లలతో ఆమె వేయించే స్టెప్పులు ప్రేక్షకుల రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తాయి ! ఆమె దర్శకత్వంలోని జానపద నృత్యాలు యువతరాన్ని ఆద్యంతమూ ఉర్రూత లూగిస్తాయి !

తన ఆటా పాటలతో - నిజామాబాద్ 'విజయ్' పేరెంట్స్‌కి చిరపరిచితురాలైన ఆవిడ: ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ, జాయింట్ సెక్రెటరీ, ఆర్మూర్ విజయ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ **శ్రీమతి కవితాదివాకర్.**

## ఆమె... రక్షణ కవచం !



**ఆ**మె - ఏ ప్రగల్భాలూ పలకరు !
ఏ ప్రలోభాలకీ లొంగరు !!

తోటి మెంబర్స్‌ని సదా ప్రోత్సహిస్తూ - ఎవరిమీద ఈగ వాలినా సహించని విజయ్ విద్యాసంస్థల రక్షణ కవచం, ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ, వైస్ ప్రెసిడెంట్: **శ్రీమతి వి. అమృతారెడ్డి.**

## ఆమె... అన్నపూర్ణ !



**ఆ**మెది చక్కటి గొంతు!

పిల్లల్లో 'పిల్ల'లా కలిసిపోయే ఆమె... మూడ్ వచ్చిపాడితే... ఆ కంఠంలో - చిత్రంగా 'పసిపాప' గొంతులోని తీయదనం జాలువారి - శ్రోతలకి పారవశ్యం కలుగుతుంది !

అడగంది అమ్మయినా పెట్టదంటారు ! కానీ - టాలెంట్‌షోస్ లాంటి ఫంక్షన్స్‌లో అలసిసొలసి పనిచేసి - ఆకలిదప్పులు మరిచిపోయే ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ సభ్యుల అలనాపాలనా పట్టించుకుంటూ - వాళ్ళు అడక్కుండానే.... అన్నంపెట్టి; ఆ సేవలలో... తన ఆకలి సైతం మరిచిపోయే... అన్నపూర్ణ: ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్ **శ్రీమతి కె. విజయలక్ష్మి .**

## ఆమె... మంచి ప్రయోక్త !



ఆమె గొప్ప క్రిటిక్ ! చక్కటి వక్త ! ఐడియల్ టీచర్ ! బెస్ట్ డ్యాన్స్ డైరెక్టర్ ! అన్నింటికీ మించి... మంచి ప్రయోక్త!

ఆమె మాటతీరూ, అడ్మినిస్ట్రేషన్ - ఆమె సబార్డినేట్స్‌కి గొప్ప ఇన్స్పిరేషన్!

అందర్తో -ఫ్రెండ్లీగా - సరదాగా - ఆడుతూ పాడుతూ పనిచేసే ఆవిడ: ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ ట్రెజరర్: శ్రీమతి ఎ. విజయ భారతి.

## ఆమె శ్రమ... అద్వితీయం!



విజయ్ విద్యాసంస్థల ఆవిర్భావ సమయంలో రాత్రనకా - పగలనకా ఎండల్లో, వానల్లో.... అహర్నిశలూ శ్రమించి - అనుదినం సహకరిస్తోన్న ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: శ్రీమతి ఎ. సుకేశిని.

## ఆమె... అలుపెరుగరు!



ఏ అవసరానికైనా రమ్మని పిలిస్తే- రెక్కలు కట్టుకొని వాలే హెల్పింగ్ నేచర్ ఆమెది. టీచర్ల ఇంటర్వ్యూల సమయంలో కేరళ దాకా తోడైవస్తూ - విజయ్ విద్యాసంస్థల పట్ల తన ఉడుతాభక్తి చాటుకుంటోన్న ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: శ్రీమతి యన్. మధు.

## ఆమె... స్టేట్ ప్లేయర్!



వాలీబాల్‌లో నాలుగు పదుల వయసులో సైతం స్టేట్‌లెవల్ లారెల్స్ సాధిస్తూ- మా చిన్నారులకి ఆదర్శంగా నిలుస్తోన్న స్టేట్ లెవల్ ప్లేయర్, మితభాషి, ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: శ్రీమతి యన్. సరిత.

## ఆమె... బెస్ట్ ప్లేయర్ !



ఆమెకు ఆడటమే కాదు... ఆడించడమూ ఇష్టమే!

'ఆటలు'ంటే... ఆకలిదప్పులు మరిచిపోయే ఆమె - పాటలంటే చెవికోసుకుంటారు!

'పనులు'ంటే... ఆటపాటలు కూడా మరిచి పోయే ఆమెకి పనిచేయడమే కాదు... పనులు చేయించుకుని రావడమూ... ఇష్టమే!

హైదరాబాద్‌లో - ఏ అవసరం వచ్చినా - అది - చీఫ్‌గెస్ట్స్‌ని ఆహ్వానించడంగానీ, పిల్లలకి ప్రైజులు కొనడం గానీ, ఎక్స్‌కర్షన్‌కి టికెట్స్ బుకింగ్ గానీ - విజయ్ విద్యాసంస్థలకి తోడుగా నిలిచే - ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్ :శ్రీమతి జి. సునీత.

## ఆమె... వినయశీలి!



ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్స్‌కి అడుగడుగునా - తన 'మోరల్ సపోర్ట్' తో అండగా నిలిచే వినయశీలి, సౌమ్య స్వభావి ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: శ్రీమతి యన్. సురేఖ.

## ఆమె కృషి... అనుపమానం!



విజయ్ విద్యాసంస్థల ప్రైమరీ విభాగానికి- పదిహేనేళ్ళపాటు తన అమూల్య సేవలందించి; ఆటపాటల్లో తనలాగే తన విద్యార్థుల్ని కూడా జాతీయస్థాయి దాకా ఎదిగేలా అవిరళ కృషిచేసిన ఐడియల్ ఎజుకేషన్ సొసైటీ మెంబర్: శ్రీమతి వసంతాచరణ్.

## ఆమె... 'విజయ్'కి తోబుట్టువు!



బాల్యమంతా స్కూల్లోనే గడిపి - స్కూల్‌తో పాటే ఎదిగిన ఆమెకి - స్కూలే ఓ తోబుట్టువు !

అ,ఆలు దిద్దిందీ... ఆటాడుకుందీ... అన్నం తిన్నదీ... చివరికి అమ్మకోసం ఎదురుచూస్తూ... అలసి నిద్దరోయిందీ ఈ తోబుట్టువు ఒళ్ళోనే!

రాత్రింబవళ్ళూ స్కూలే ఓ 'లోకం'గా పెరిగిన ఆమెకు- స్కూలంటే ఎనలేని ప్రాణం ! అంతులేని మమకారం !

తనకి ఏం కావాలో వాళ్ళమ్మని ఎప్పుడూ అడిగేది కాదు గానీ... తన స్కూల్‌కి ఏం కావాలో అడిగి-మరీ సాధించుకునేది !

" అందరికీ సొంతిళ్ళున్నాయి ! మనం కట్టుకోవద్దా ?" అని తన పదేళ్ళ వయసులో ఆమె అడిగిన ప్రశ్నకి -

" మనకి ఇల్లు లేకపోతే... కేవలం నువ్వూ నేనే ఇబ్బంది పడ్తాం ! కానీ... స్కూలు అలా కాదు నాన్నా ! కొన్ని వందల మంది పిల్లలు ఇబ్బంది పడ్తారు ! స్కూలుకో బిల్డింగ్ కట్టేదాకా - మనం ఇల్లు కట్టుకోవద్దు !" అన్న అమ్మని సంభ్రమంగా చూసిందే తప్ప - ఈషణ్మాత్రం బాధపళ్ళేదు!

స్కూలు అవసరాలపట్లా - తన తల్లి కమిట్‌మెంట్ పట్లా- ఆమె 'అండర్‌స్టాండింగ్' అలాంటిది !

చివరకు... తన పదమూడేళ్ళ వయసులో ఆమె - స్కూలు కో 'గూడు'ని చూసింది ! మరో పదేళ్ళకి తనకంటూ ఓ 'మేడ'నీ చూసింది ! కానీ... ఆపాటికే పెళ్ళయి వెళ్ళిపోయిన ఆ 'చిలక' కి - ఎందుకో - ఇప్పటికీ తన మేడ కన్నా ఈ గూడంటేనే ఇష్టం !

విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయుల పట్ల అమిత గౌరవం, పిల్లల ఆలనా పాలనా చూసుకునే ఆయాల మీద అత్యంత ఆదరణా చూపే ఆమె - చదివిన సంస్థలోనే సభ్యత్వం స్వీకరించి తన చేయూత నందిస్తోన్న:

**డా॥ హిమచందన్.**